క్లుప్తంగా

మైక్‌సెట్‌ను బహూకరించిన విద్యార్థులు


కొమ్మర యూపీ స్కూల్‌కు వైర్‌లెస్ మైక్ సెట్ అందిస్తున్న విద్యార్థులు

గణపవరం: జల్లికొమ్మర ప్రీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ పాఠశాలలో చదివిన విద్యార్థులు రూ.20వేలు విలువైన వైర్‌లెస్ మైక్‌సెట్‌ను పాఠశాలకు బహూకరించారు. 2022–23లో 8వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు, ప్రస్తుతం 2023–24 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు కలిసి ఈ మైక్ సెట్ అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.టి. సుందరకుమార్ తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యులైన విద్యార్థులను ఉపాధ్యాయులు సౌజన్య, శ్రీదేవి,పార్వతి, లీలాగోపాల్, రమేష్, గైడ్ టీచర్ శిరీషా అభినందించారు.

ఎన్‌సీఆర్‌సీ లీగల్ అడ్వైజర్‌గా గన్నాబత్తుల విజయ


నియామకపత్రాన్ని అందిస్తున్న ఎన్‌సీఆర్‌సీ చైర్మన్ మణికంఠ

నిడమర్రు: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా న్యాయ సలహాదారుడిగా భీమవరానికి చెందిన లాయర్ గన్నాబత్తుల విజయ సత్యవతిని నియమించినట్లు కమిషన్ చైర్మన్ లింగపల్లి ఎన్ఎస్‌వీఎస్ మణికంఠ తెలిపారు. ఆదివారం బువ్వనపల్లిలో ఈస్ట్ జోన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లాయర్ విజయకు నియామక పత్రాన్ని వైస్ చైర్మన్లు నోచర్ల శ్రీనివాసరావు, సంకు నాగేషు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ జిల్లాలోని వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం తనవంతుగా ఫిర్యాదుదారుల తరఫున ఉచిత న్యాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంకు తాతాజీ, లక్ష్మీగణేశ్వరరావు ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


పెదవేగిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పెదవేగి : త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పెదవేగి మండలం ముందూరు, పెదవేగి గ్రామాల్లో ప్రత్యేక భద్రతా బలగాలతో పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం నెలకొనాలని, ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని, దీనికి ప్రజలంతా సహకరించాలని పోలీసులు కోరారు. ఎటువంటి అల్లర్లు గొడవలకు తావివ్వకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు, నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య సూచనల మేరకు, పెదవేగి సీఐ కొండవీటి శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, సిబ్బంది ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహించారు.

బీసీలకు రాజకీయ ప్రాధాన్యం


జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావును సత్కరిస్తున్న దృశ్యం

పెదవేగి : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని రకాలుగా బీసీలకు అండగా నిలిచి రాజకీయ ప్రాధాన్యత కల్పించిందని ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు అన్నారు. ఆదివారం ఘంటా ప్రసాదరావును ఏలూరు నగర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బంకురు వెంకట్, ఏలూరు నగర బీసీ సెల్ ప్రెసిడెంట్ లక్కొజీ గోపి, ఏలూరు కొప్పుల వెలమ కల్యాణ మండపం నిర్మాణం కమిటీ ప్రెసిడెంట్ ఇదుపాలి రంగారావు, ముఖ్య నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పోలింగ్ కేంద్రంలో మరమ్మతులు

ఉంగుటూరు: అప్పారావుపేటలోని 57వ పోలింగ్ కేంద్రంలో మరమ్మతులు చేపట్టినట్టు ఏలూరు ఆర్డీవో, ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి ఆదివారం తెలిపారు. అప్పారావుపేటలోని ఎంపీపీ పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ పోలింగ్ కేంద్ర భవనం పాక్షిక మరమ్మతులకు గురైందని, వాటిని సరిచేసి, రంగులు వేస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో పనులు రెండు రోజుల్లో పూర్తవుతాయని ఆయన తెలిపారు.

మృత్యుంజయుడు ఏసుక్రీస్తు

- భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు
- ఫాదర్ల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శనతో ర్యాలీ
- కళకళలాడిన క్రైస్తవ దేవాలయాలు


పెదవేగి: ఈస్టర్ ప్రత్యేక ఆరాధన నిర్వహిస్తున్న గ్రేస్ వ్యవస్థాపకులు

భీమడోలు: క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ఆదివారం పునరుత్థాన (ఈస్టర్) పండుగను ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు గుడ్‌ఫ్రైడే నాడు మృతి చెంది తిరిగి మూడో రోజు మృత్యుంజయునిగా తిరిగి లేచిన ఆదివారాన్ని పునరుత్థానంగా క్రైస్తవ లోకం జరుపుకుంటోంది. క్రైస్తవులు సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, పోలసానిపల్లి, కోడూరుపాడు, లంక గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసారు. విద్యుత్ కాంతులతో ఆలయాలను శోభాయామానంగా తీర్చిదిద్దారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎంతో ప్రాముఖ్యత గల ఈ పండుగను క్రైస్తవులు భక్తి విశ్వాసంతో, ఆనందంతో జరుపుకున్నారు. క్రైస్తవులు క్రిస్మస్ తర్వాత ప్రాముఖ్యమైన పండుగగా ఈస్టర్‌ను జరుపుకోవడం సంప్రదాయబద్ధంగా వస్తోంది. మండలంలోని ఆర్‌సీఎం, సీఎస్ఐ, రక్షణసైన్యం, ఇతర సంఘాల ఆధ్వర్యంలో శనివారం రాత్రి జాగరణ ప్రార్థనలు చేసారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చిలో విచారణకర్త ఫాదర్ ఫింటో థామస్ ఆధ్వర్యంలో విచారణ పరిధిలోని క్రైస్తవులంతా వేకువ జామున ఏసు ప్రభువు పునరుత్థానుడై తిరిగి లేచిన సందర్భాన్ని గుర్తు చేసుకుని ప్రతి ఒక్కరూ కొవ్వొత్తులతో దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసారు. డీపాల్ స్కూల్ ప్రిన్సిపల్ ఫాదర్ నెల్సన్ ఈస్టర్ కొవ్వొత్తి వెలిగించి ఈ వెలుగు ప్రతి ఒక్కరి జీవితాల్లో నింపాలని ఆకాంక్షించారు. విచారణ కర్త ఫాదర్ షింటో థామస్ దివ్యపూజ బలిని సమర్పించి ఈస్టర్ విశిష్ఠతను వివరించారు. ప్రభువు చూపిన మార్గంలో శాంతి, సహనం, ఇతరుల పట్ల ప్రేమానురాగాలతో మెలగాలన్నారు. ఈస్టర్ పండుగ కేక్ కట్ చేసారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఫాదర్ జోషి జోసెఫ్, జింటో, కన్యస్త్రీలు, డీపాల్ విన్సెంట్ సొసైటీ సభ్యులు, జీసస్ యూత్, మరియదళ సభ్యులు, పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.


భీమడోలు: ఫాదర్ నెల్సన్, ఫింటో థామస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన


దెందులూరు: సాల్వేషన్ ఆర్మీ సమాధుల తోటలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

తోటివారిపై ప్రేమానురాగాలు కలిగి ఉండాలి

సూరప్పగూడెం రక్షణసైన్యం చర్చిలో ఆదివారం ఫాదర్ భూపతి ఆధ్వర్యంలో ఈస్టర్ సందర్భంగా విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామానికి చెందిన దాతలు మండే సుజాత, అందుగుల భూషమ్మ చర్చిలోని 45 మంది పేద మహిళలు, వృద్ధులకు నూతన వస్త్రాలను అందించారు. దాత బొల్లారపు ప్రేమలత, కుమారులు చర్చికి సోఫా సెట్‌ను బహూకరించారు. ఫాదర్ భూపతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అసూయ ద్వేషాలను విడనాడి ఇతరుల పట్ల జాలి, దయ కలిగి ఉండాలని కోరారు. పెద్దలు బి.మధు, ఏ.ఆదినారాయణ, ఉపాధ్యాయుడు మండే సుధాకర్, విశ్వాసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఈస్టర్ వేడుకలు

పెదవేగి : సమాధిలో నుంచి మూడవ రోజు ప్రభువైన క్రీస్తు మానవుల కోసం తిరిగి లేచారని నడిపల్లి విచారణ గురువు ఫాదర్ రాజు తెలిపారు. నడిపల్లి పవిత్ర త్రేత్వైక సర్వేశ్వర దేవాలయంలో విచారణ గురువులు డి.రాజు, రెక్టర్ ఫాదర్ చిట్టిబాబు క్రీస్తు పునరుత్థాన పండుగ గుడ్ ఫ్రైడే విశిష్టతను సంఘ విశ్వాసులకు వివరించారు. ఈ కార్యక్రమంలో 9 గ్రామాల సంఘ విశ్వాసులు ఈస్టర్ పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నడిపల్లి సంఘస్తులు, గొట్టేటి స్టాలిన్, యంత్రపాటి మహేష్ ,గాంలికి దానియేలు, యంత్రపాటి శ్రీను, తనగల రాంబాబు, వెంకట్రావు మాస్టారు, మోహన్ రావు మాస్టారు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు. విజయరాయి పునీత అంథోనివారి దేవాలయంలో విచారణ గురువు దివాకర్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం ఏసుక్రీస్తు పునరుత్థాన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల్లో కన్యస్త్రీలు, ఉపదేసులు, విజయరాయి, ముత్తనవీడు, రాయన్నపాలెం, రాట్నాలకుంట, చింతలపాటివారి గూడెం, కొండలరావుపాలెం ప్రజలు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు పునరుత్థానం విశ్వాసానికి ప్రతీక

దెందులూరు: మృతులను జ్ఞాపకం చేసుకోవడం ఆశీర్వాదకరమని ఏసుక్రీస్తు పునరుత్థానం విశ్వాసానికి ప్రతీక అని సాల్వేషన్ ఆర్మీ రిటైర్డ్ కల్నల్ జోషి, దెందులూరు కోర్ ఆఫీసర్ రమణయ్య అన్నారు. ఆదివారం గ్రామగ్రామాన ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు క్రైస్తవ దేవాలయాల్లో, సమాధుల తోటల్లో నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున దెందులూరు సాల్వేషన్ ఆర్మీ సమాధుల తోటలో కోర్ ఆఫీసర్ రమణయ్య ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. సమాధులను వారి కుటుంబ సభ్యులు, బంధువులు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి కొవ్వొత్తులు వెలిగించి పూలదండలు వేసి నివాళులర్పించారు. కోర్ ఆఫీసర్ రమణయ్య ఈస్టర్ పర్వదిన ప్రాముఖ్యతను వివరించారు. సంఘ పెద్దలు పల్లె సామ్యూల్ గాంధీ, నున్నా గాబ్రియేలు, సామ్యూల్, కొత్తపల్లి ఫణికుమార్, కొత్తపల్లి రాజారామ్, పాలపర్తి అనిల్, సాల్వేషన్ ఆర్మీ గృహసమితి సభ్యులు, చిన్నారులు, సంఘస్తులు పాల్గొన్నారు.

వీఆర్వోపై కలెక్టర్‌కు నివేదిక

దెందులూరు: దెందులూరు వీఆర్వో అనిరుధ్, తహసీల్దార్, జిల్లా అధికారులకు అవాస్తవాలు చెప్పడమే కాకుండా తప్పుదోవ పట్టించేలా విధులు నిర్వహించడంపై కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని దెందులూరు తహశీల్దార్ వీ.జితేంద్రకుమార్ అన్నారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ దెందులూరు టీటీడీ కల్యాణ మండపం పక్క ఉన్న స్థలాన్ని కన్వర్షన్ చేయకుండా మెరక చేస్తుండటంతో ఎవరు, ఎందుకు మెరక చేస్తున్నారని అధికారులు వీఆర్వోను అడిగితే కన్వర్షన్ చేశారని అబద్ధం చెప్పడంతోపాటు, జిల్లా అధికారులను తప్పుదోవ పట్టించేలా వ్యవహరించడంతో పూర్తిస్థాయి నివేదికను రూపొందించి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. వీఆర్వోకు షోకాజ్ నోటీస్ ఇచ్చామని, దీనికి ఆయన సంజాయిషీ ఇచ్చారని, కలెక్టర్‌కు ఇచ్చే నివేదికలో వీటినికూడా పొందుపర్చామని తహసీల్దార్ అన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు


ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం గుడివాకలంకలో శ్రీకోదండరామ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నాలుగు రోజులుగా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం దానగూడెం, తానాడ జట్లు మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. గ్రామస్తులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై పోటీలను తిలకించారు. స్థానిక బీసీ కాలనీలోని వాలీబాల్ కోర్టులో ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలు నిర్వహిస్తున్నారు. కొల్లేరు గ్రామాలకు చెందిన 10 జట్లు నాకౌట్ విధానంలో తలపడుతున్నాయి. విజయం సాధించిన జట్లు ఫైనల్‌కు చేరుకుంటాయి. గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే ఈ పోటీల్లో కొల్లేరు గ్రామాల జట్లు మాత్రమే పాల్గొంటాయి. ఫైనల్‌లో గెలుపొందిన జట్టుకు రూ.35 వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీ అందిస్తామని నిర్వాహకులు ప్రకటించారు. ద్వితీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.25 వేలు, తృతీయస్థానానికి రూ.15 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు నగదు అందిస్తామని నిర్వాహకులు ప్రకటించారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన


ఆగడాలలంకలో ర్యాలీగా వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

భీమడోలు: నవరత్నాల ద్వారా పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరలా ఆశీర్వదించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం కొల్లేరు గ్రామం ఆగడాలలంకలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వందలాది మంది వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలి వచ్చారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సోదరుడు పుప్పాల కార్తీక్ ఆధ్వర్యంలో పార్టీ మండల, జిల్లా, రాష్ట్ర ప్రతినిధులు ఆగడాలలంకలో విస్తృతస్థాయిలో ప్రచారం చేసారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకే తమ అమూల్యమైన ఓట్లు వేయాలని, రెండు బటన్లు నొక్కి అఖండ మెజార్టీతో పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ చంద్రబాబు నెరవేర్చలేదని పుప్పాల కార్తీక్ విమర్శించారు. జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకుని మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు ప్రజల ముందుకు వస్తున్నారని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి ప్రజా సంక్షేమ పాలనను అందించారని కొనియాడారు. మళ్లీ సీఎంగా జగనన్నను, ఉంగుటూరు ఎమ్మెల్యేగా పుప్పాల వాసుబాబును గెలిపించి ప్రజలందరికీ సేవ చేసుకునే అవకాశం ఇవ్వాలని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసారు. జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ అందించిన లబ్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనమాల రామయ్య, మండల పార్టీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, జిల్లా డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి రాజీలు, రాష్ట్ర జాయింట్ కార్యదర్శి వగ్వాల అచ్యుతరామారావు, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు గోలి సుబ్బారావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మగుంట రంగ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు, జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, నాయకులు భలే విష్ణు నారాయణ, సైదు గోపాలకృష్ణ, వేములమంద రామరాజు, జంగం యోసేబు, రామిశెట్టి శ్రీనివాసరావు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనది


ఉపాధ్యాయ దంపతులను సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు


పెదవేగి : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైందని, అలాంటి వృత్తిలో అంకితభావంతో పనిచేయడం అనేది మరింత గొప్ప విషయమని పెదవేగి ఎంఈవో సీహెచ్ బుద్ధవాస్ అన్నారు. పెదవేగి మండలం కొండలరావుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పామర్తి వెంకటేశ్వరరావు పదవీ విరమణను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో బుద్ధవాస్ ఆధ్వర్యంలో వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. పెదవేగి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం టి.ఎడ్వర్డ్ వి.వెంకటరమణ, తేరా, ప్రభాకర్, కుమార్, నరేంద్ర, సీఆర్పీ ఆదామ్, లక్ష్మీనారాయణ, రామదుర్గ, సుధ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమ నిర్మాణానికి సహకరించాలి


గోపీనాథపట్నంలో సమావేశమైన మానవత సభ్యులు

ఉంగుటూరు: మానవత ఆధ్వర్యంలో ఆనంద నిలయం పేరుతో నిర్మిస్తున్న వృద్ధాశ్రమానికి అందరూ సహకరించాలని మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి కోరారు. ఆదివారం గోపీనాథపట్నంలో గంజి రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన మానవత సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటుకు, ట్రాఫిక్ నియంత్రణకు స్టాపర్స్ ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. ఏప్రిల్‌లో వెన్నెముక సమస్యలపై ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో గోపీనాథపట్నం సర్పంచ్ పుత్సకాయల విష్ణుమూర్తి, మానవత సీనియర్ నాయకులు అడపా శ్రీనివాస్, గుణ్ణం బుల్లెబ్బాయి, సీతాల సత్యనారాయణ, కోనే వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

చంద్రబాబుకు గుణపాఠం తప్పదు


దెందులూరులో మాట్లాడుతున్న తేరా ఆనంద్

దెందులూరు: ఎమ్మెల్యే స్థానానికి పోటీచేసే వ్యక్తిని టిప్పర్ డ్రైవర్ అని హేళన చేసిన చంద్రబాబును ఎన్నికల కమిషన్, కోర్టులు సుమోటోగా స్వీకరించి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ ప్రశ్నించారు. ప్రతిభ, ప్రజాదరణ, సామర్థ్యం, సామాజిక సమతుల్యతలను గౌరవిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తున్నారని అన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఎస్సీలను మీకెందుకు రాజకీయాలు అని కించపరిచారని గుర్తు చేశారు. పేద, బడుగు, బలహీన, కార్మిక వర్గాలను కించపర్చేలా వ్యవహరించిన వారికి రాబోయే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. చంద్రబాబు వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్, కోర్టులు స్పందించాలని కోరారు.

ఏలూరు వైఎస్సార్ సీపీలో నియామకాలు

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్లనాని ఆదేశాల మేరకు ఏలూరు నియోజకవర్గం, నగర కమిటీ, అనుబంధ విభాగాల్లో పలువురికి పదవులు కేటాయించారు. ఏలూరు నగర పార్టీ అధ్యక్షుడు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ ఆదివారం నూతన నియామకాలపై ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ ఏలూరు నగర కమిటీ జనరల్ సెక్రటరీలుగా కోటగిరి వెంకటేశ్వరరావు, షేక్ రహీమ్‌తుల్లా, నియోజకవర్గం పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా కోలా భాస్కరరావు నియమితులయ్యారు. ఏలూరు నగర బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా మర దాని రమేష్, ఏలూరు నగర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా చోడగిరి అనిల్‌కుమార్ నియమితులయ్యారు.

ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి


శౌరీపురంలో స్థానిక నాయకులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : శౌరీపురంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకున్నామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు మండలం, వట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని శౌరిపురంలో శనివారం రాత్రి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన అబ్బయ్య చౌదరికి శౌరిపురం ప్రజలు నీరాజనాలు పలికారు. గుడ్ మార్నింగ్ దెందులూరు కార్యక్రమంలో ప్రజలు కోరిన ప్రతి సదుపాయాన్ని ఏర్పాటు చేసిన ఎమ్మెల్యేకు స్థానికులు జేజేలు పలికి కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో గుడ్ మార్నింగ్ దెందులూరు కార్యక్రమంలో భాగంగా ఇక్కడికి వచ్చినప్పుడు, తాము కోరినట్లుగా ఊరంతా సీసీ రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ సౌకర్యాలను ఏర్పాటు చేశారని ప్రజలు ఎమ్మెల్యేకి కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ శౌరిపురం ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానని, గత పాలనకు ఇప్పటి అభివృద్ధికి తేడా గమనించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాద్, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి అభివృద్ధి, సంక్షేమం కోసం జగనన్న కృషి

దెందులూరు: ప్రతి ఒక్కరి అభివృద్ధి, సంక్షేమం, స్వయం ఉపాధి లక్ష్యంగా ఐదేళ్లుగా చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలందరూ మద్దతునివ్వాలని, రాబోయే ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌కు వేసి మద్దతునివ్వాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఆదివారం పోతునూరులో నిర్వహించిన నేను సిద్ధం- మా ఊరు సిద్ధం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లల్లో వైఎస్సార్ సీపీ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. భవిష్యత్తు అంతా అభివృద్ధి, సంక్షేమం అమలయ్యేందుకు ప్రతి కుటుంబం స్వయం ఉపాధి, భద్రత, సుఖ సంతోషాలతో జీవించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలనను గడపగడపకు తీసుకురావడమే కాకుండా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలులో మధ్యవర్తుల పాత్ర లేకుండా లబ్ధిదారులు బ్యాంకు ఖాతాలకు ఐదేళ్లుగా జమ చేస్తున్న వైఎస్ జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. పోతునూరులో నేను సిద్ధం–మా ఊరు సిద్ధం కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఘంటా ప్రసాదరావులకు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, సర్పంచ్ బోదుల స్వరూప్, పార్టీ సీనియర్ నాయకులు నున్నా ఆశీర్వాదం, మండల ఉపాధ్యక్షుడు తలారి రామకృష్ణ, ఎంపీటీసీ సున్నా నరేష్, జిల్లా కమిటీ సభ్యులు సున్నా ఫణి, నాయకులు, రమేష్, బుద్దా అర్జున, బత్రాజు సత్యనారాయణ, బోదుల రవి, వాసే డొమినిక్ కార్యకర్తలు ఉన్నారు.


పోతునూరులో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు


సూర్యరావుపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ తాతా రమ్య, నాయకులు

గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రభుత్వ పథకాలపై ప్రచారం

పెదవేగి : సార్వత్రిక ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసేందుకు మేమంతా సిద్ధమంటూ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఆదేశాలతో ఆదివారం పెదవేగి ఎంపీపీ తాతా రమ్య ఆధ్వర్యంలో పెదవేగి మండలం సూర్యారావుపేటలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని నాయకులు వివరించారు. పెదవేగి మండలం అప్పనవీడులో నేను సిద్ధం మా ఊరు సిద్ధం కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు విస్తృత స్థాయిలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో అప్పన ప్రసాద్, మండల ఉపాధ్యక్షురాలు అప్పన పద్మావతి, ఎంపీటీసీ బుద్దే రామసీత, సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై స్వామి

దెందులూరు: ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు, గతంలో పలు కేసుల్లో అరెస్టు అయిన వారి నడవడికపై పోలీస్ నిఘా ఉందని దెందులూరు ఎస్సై కే.స్వామి తెలిపారు. ఆదివారం దెందులూరు మండలం పరిధిలోని రౌడీషీటర్లకు దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రజలు ప్రశాంతంగా ఓటు వినియోగించుకుని ఇళ్లకే పరిమితమవ్వాలన్నారు. శాంతిభద్రతలకు, ఎన్నికల విధులకు విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడాలని సూచించారు.పోలీస్ శాఖ, ఎన్నికల కమిషన్ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తే చర్యలు తప్పవన్నారు.

ఉంగుటూరు టీడీపీలో అలజడి

ఉంగుటూరు: ఉంగుటూరు టీడీపీలో పార్టీ శ్రేణుల మధ్య అలజడి, ఆందోళన నెలకొంది. ఉంగుటూరు నియోజకవర్గ సీటును టీడీపీ ఇన్‌చార్జి గన్ని వీరాంజనేయులుకు కాకుండా జనసేనకు కేటాయించడంతో ఆ పార్టీ తరపున ధర్మరాజు బరిలో నిలిచారు. ఈ నేపథ్యంలో స్థానిక టీడీపీ నేతలు గన్ని వీరాంజనేయుల నుంచి ఆదేశాలు రాకుండానే సొంత నిర్ణయాలు తీసుకుంటూ ముందుకెళుతుండటం కేడర్‌లో ఆందోళన రేకెత్తిస్తోంది. పార్టీని నిర్వీర్యం చేసేలా పలువురు వ్యవహరిస్తుండటంపై మండిపడుతున్నారు. ఆదివారం మండలంలోని నారాయణపురం గ్రామ కమిటీ సమావేశంలో ఇదే చర్చ కార్యకర్తలు, నాయకుల మధ్య కొనసాగడం గమనార్హం. టీడీపీ ఉంగుటూరు మండల అధ్యక్షుడు పాతూరి విజయకుమార్, రాష్ట్ర స్థాయిలో టీడీపీ పదవులు నిర్వహించిన అక్కిన నాగమణి, ఆమె కుమారుడు అక్కి శేషగిరిరావు (శేషు), మాజీ ఎంపీపీ, తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేసిన గోలి శ్రీనివాస్ తదితరులు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని సమావేశంలో పలువురు నేతలు, కార్యకర్తలు మండిపడటం గమనార్హం. వారిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. జనసేనకు సీటు కేటాయించిన నేపథ్యంలో నియోజకవర్గంలో టీడీపీ బలహీనమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే కొనసాగితే నియోజకవర్గంలో టీడీపీ తరపున సీటు ఆశించేవారికి భవిష్యత్తు ఉండదని చర్చించుకోవడం గమనార్హం.

భీమడోలు కోర్టుకు పక్కా భవనం నిర్మించాలి

భీమడోలు: ఏలూరులో ఆదివారం నిర్వహించిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి, భీమడోలు కమిటీ అధ్యక్షుడు పి.రాజారావు భీమడోలు సివిల్ కోర్టుకు పక్కా భవనం నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో భీమడోలు కమిటీ అధ్యక్షుడు పి.రాజారావుతో పాటు ప్రధాన కార్యదర్శి ప్రత్తిపాటి బాలాజీ, సంయుక్త కార్యదర్శి గౌటికల సంజయ్ బాబు, కోశాధికారి పంట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు దిగుపాటి రాజాగోపాల్, ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు తదితరులకు వారు వినతిపత్రాలు అందించారు.